క్లుప్తంగా

11న లోక్ అదాలత్

పాలకొండ రూరల్: స్థానిక కోర్టు ప్రాంగణంలో ఈనెల 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను అదాలత్‌లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడ్వంచర్ పార్క్‌లో బొమ్మ ట్రైన్ ఏర్పాటు



పార్కులో ఏర్పాటు చేసిన టాయ్‌ట్రైన్

సీతంపేట: స్థానిక అడ్వంచర్ పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన మినీ టాయ్‌ట్రైన్‌ను ఐటీడీఏ పీఓ బి.నవ్య సోమవారం ప్రారంభించారు. పర్యాటకులను ఆకట్టుకునేందుకు వీలుగా పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రూ.3 లక్షలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముగిసిన మందిర ప్రతిష్టోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని పసుకుడిలో చేపట్టిన శ్రీకృష్ణ, చైతన్య మహాప్రభు మందిర ప్రతిష్టోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పాలసొసైటీ చైర్మన్ బి.ఆనందరావు దంపతులు ఆలయ ప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన ఓమణిగ హరేరామ సంకీర్తన బృందంతో చేపట్టిన తిరువీధి ఉత్సవం ఆకట్టుకుంది. మందిరం నిర్మాత, గ్రామ సర్పంచ్ బివర భార్గవనాయుడును ఉప సర్పంచ్ దీనబంధు గోజో, సంకీర్తన బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సామూహిక అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

మే 7 నుంచి పైడితల్లి పండగ

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను మే నెల 7 నుంచి మూడ రోజుల పాటు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిశ్చయించారు. ఏప్రిల్ 16న పండగ చాటింపు, 30న వనము నుంచి బోయిడు ఇంటికి అమ్మవారిని తీసుకురానున్నట్లు తెలిపారు. మే నెల 7,8,9వ తేదీల్లో గ్రామదేవత పండగ చేసేకునేందుకు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మ యాజీ ముహూర్తం ఖరారు చేశారు. అయితే ఇందుకు గ్రామంలో కొందరు సుముఖత వ్యక్తం చేయగా.. మరికొందరు వ్యతిరేకించారు.

రేపటి నుంచి సీబీటీ పరీక్షలు



తరగతుల వారీగా ప్రశ్నపత్రాలను వేరుచేస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

గరుగుబిల్లి: పాఠశాల విద్యార్థులకు ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు క్లాస్‌రూం బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహణకు మండల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక ఎమ్మార్సీలో తరగతుల వారీగా ప్రశ్నపత్రాలను విభజిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 8న తెలుగు, 9వ ఇంగ్లిష్, ఈవీఎస్ పరీక్షలు నిర్వహించనున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 8న తెలుగు, 9న హిందీ, సైన్స్, 10న ఇంగ్లిష్, సోషల్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రశ్నపత్రాలతో పాటు ఓఎంఆర్ సీట్లను ఇవ్వనున్నారు. ప్రైవేటు పాఠశాలకు ప్రశ్నపత్రాలను మాత్రమే అందించనున్నారు.

సకాలంలో వేతనాల చెల్లించాలి

సీతానగరం: గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి. వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ల సంఘం అధ్యక్షుడు జె.గౌరి కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ విస్తరణాధికారి ఎస్ఎస్ వర్మకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛ హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పీఎం నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రీన్ అంబాసిడర్లు అమలు చేస్తున్నారన్నారు. హరిత రాయబార్లకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా గతంలో వేతనాలను చెల్లించేవారన్నారు. ప్రస్తుతం వీరి వేతనాలను పంచాయతీల ద్వారా చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అయితే పంచాయతీలు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హరిత రాయబార్లకు వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పరిహారమే.. ప్రోత్సాహం





ఏజెన్సీలో విరివిగా సాగవుతున్న జీడితోటలు

- నియోజకవర్గంలో విస్తారంగా జీడి సాగు
- వాతావరణ మార్పులు, చీడపీడలతో ఏటా నష్టపోతున్న రైతులు
- ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింప చేస్తే సాగుకు ప్రోత్సాహం

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా సాగయ్యే పంట జీడిమామిడి. గిరిజనులకు జీవనోపాధి కల్పించడం, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)-పార్వతీపురం వారు 1980-90 దశకంలో జీడి తోటల పెంపకాన్ని బృహత్తర ప్రణాళికగా చేపట్టారు. మొదట గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో, తరువాత జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, సాలూరు సబ్‌ప్లాన్ ఏరియా అంతటా విస్తారంగా జీడితోటలను సాగు ప్రారంభించారు. తద్వారా అనతికాలంలోనే గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించేలా అప్పటి ప్రాజెక్ట్ అధికారులు ఆర్.పి.సిసోడియా, బి.జగన్నాథం విశేష కృషిచేశారు. ఇదే తరహాలో సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిశిఖర గ్రామాలైన పొల్ల, దొనుబాయి, పెదరాం తదితర ఏజెన్సీ ప్రాంతమంతటా జీడితోటల పెంపకం విరివిగా చేపట్టి గిరిజనుల ఆర్థిక పరిపుష్టికి 'బాసటగా' నిలిచారు అక్కడి ప్రాజెక్ట్ అధికారులు. ఫలితంగా పార్వతీపురం-సీతంపేట ఏజెన్సీ ప్రాంతమంతటా విస్తారంగా జీడిమామిడి సాగవుతోంది. గత మూడు దశాబ్దాలుగా నియోజకవర్గంలోని గిరిజన రైతులు జీడి పంటనే ప్రధాన ఆర్థిక వనరుగా ఎంచుకొని, జీవనోపాధి పొందుతున్నారు.

పార్వతీపురం-సీతంపేట ఐటీడీఏల పరిధిలో జీడిమామిడి సాగు వివరాలు

మండలం	సాగు (ఎకరాల్లో)
గుమ్మలక్ష్మీపురం	14,500
కురుపాం	12,000
జియ్యమ్మవలస	3,000
కొమరాడ	3,500
సాలూరు	4,000
మక్కువ	2,000
పార్వతీపురం	1,500
సీతంపేట	6,199
భామిని	9,580
వీరఘట్టం	1,286
పాలకొండ	2,980

రెండేళ్లుగా నష్టాలే..

ప్రస్తుతం జీడిమామిడి తోటలు పూత, పిందె దశలో ఉన్నాయి. అయితే గత రెండేళ్లుగా వాతావరణ మార్పులు, పొగమంచు, చీడపీడల కారణంగా ఏటా రైతులు నష్టపోతున్నా రు. అయినా ప్రభు త్వం నుంచి తమకు ఎలాంటి పరిహారం అందడం లేదని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకం, వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంపై సరైన అవగాహన లేక బీమా పరిహారం పొందలేకపోతున్నారు. వరి, అపరాలు, మొక్కొజొన్న తదితర పంటల మాదిరిగానే ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నా.. వాణిజ్య పంటలకు పైన పేర్కొన్న బీమా పథకాలను వర్తింప చేయకపోవడంతో తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా జీడిపంటకు ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపచేసి, పంట నష్టాల నుంచి తనను గట్టెక్కించాలని జీడిరైతులు కోరుతున్నారు.

పంటల బీమా వర్తింపచేయాలి



పార్వతీపురం-సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల్లో విరివిగా సాగవుతున్న జీడి పంటను వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమా పథకంలో చేర్చినట్లయితే జీడి రైతులకు పంట నష్టాల నుంచి కొంత ఊరట లభిస్తుంది. జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని జీడి రైతులకు పంటబీమా పథకం వర్తింప చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది. గిరిజన జీడి రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

– అడ్డాకుల చిన్నారావు, మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, గుమ్మలక్ష్మీపురం

బీమా పొందాలంటే ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి



జిల్లాలో గల జీడిరైతులు వరి, వేరుశనగ, అరటి, చెరకు తదితర పంటల మాదిరిగానే జీడిమామిడి పంటను కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలి. అప్పుడే ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ అనుకూలత రీత్యా పంట నష్టం వాటిల్లితే ఉచిత పంటల బీమా వర్తిస్తుంది. ఈ మేరకు సంబంధిత మండల వ్యవసాయ శాఖాధికారులు లేదా గ్రామ వ్యవసాయ సహాయకులు జీడి రైతులకు అవగాహన కల్పించాలి.

– కె.మణిభూషణరావు, హార్టికల్చర్ ఆఫీసర్, ఐటీడీఏ, పార్వతీపురం మన్యం జిల్లా

గృహ సారథులే రథసారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు, వేదికపై తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రానున్న ఎన్నికల సమరానికి గృహ సారథులే రథసారథులని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేటలోని కళింగ వైశ్య భవనం వద్ద గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై సోమవారం దిశానిర్దేశం చేశారు. మంచి చేస్తే అధికారం ఇవ్వండనే మాటతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారని అందుకు అనుగుణంగా అందరం పాటుపడాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందనేది వారికి తెలియజేయాలని కోరారు. ప్రజల్లో అసంతృప్తి ఉంటే సర్దుబాటు చేయాల్సిన బాధ్యత వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. ప్రతి కుటుంబాన్ని అక్కున చేర్చుకుని అప్యాయంగా వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేదిశగా అడుగులు వేయాలని సూచించారు.

సీఎం ఒక రక్షకుడు నిరుపేద, బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఒక రక్షకుడిలా ఉన్నారని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మనమందరం క్షేత్రస్థాయిలో బలంగా అమలు చేయాలని కోరారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బలంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డికి నమ్మకం, గౌరవం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైస్ ఎంపీపీలు వి.సాయిరాం, బి.హేమలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెరికి బలిజ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 51 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ నవ్య

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి బి.నవ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 51 వనతులు అందాయని అధికారులు తెలిపారు. సీసీ రహదారి నిర్మించాలని కోరుతూ కొండచొర్లంగికి చెందిన లావణ్య, వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ వైటీసీ ఇన్‌చార్జిలు, వరదగోడ మంజూరు చేయాలని కొత్తగూడకు చెందిన అంజయ్య అధికారులకు వినతులు అందజేశారు. టార్పాలిన్లు ఇప్పించాలని పనసగూడ గ్రామస్తులు, కంప్యూటర్ కాటా ఇప్పించాలని దొండమానుగూడకు చెందిన సింహాచలం, పింఛను మంజూరు చేయాలని కుంబికి చెందిన రామారావు, అంగన్‌వాడీ పోస్టు మంజూరు చేయాలని ఇలిసిపురానికి చెందిన పద్మ అధికారులను కోరారు. స్పందనలో గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏఎంఓ పి.కోటిబాబు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, సీడీపీఓ రంగలక్ష్మి, పీఏఓ హరిబాబు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకాబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



సీతంపేట: విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సీతంపేట: పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో రక్తహీనత, అయోడిన్ లోపం, విటమిన్-ఏ,డీ డెఫిషియన్సీతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి, వారికి తగిన చికిత్స అందించేందుకు వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ టి.లావణ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.ప్రసాద్, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణారావు

- పాలకొండ రూరల్: స్థానిక పీకే వీధి ఉన్నత పాఠశాలలో సోమవారం కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యుడు టి.కృష్ణారావు విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. 55 మంది నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి త్వరలో ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం జామి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరుశురాంపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శిరీష

కొమరాడ: మండలంలోని పరుశురాంపురం గ్రామం లో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో కొమరాడ పీహెచ్‌సీ డాక్టర్ శిరీష రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలందించారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

ఉపకరణాల ఎంపిక శిబిరం



శిబిరంలో వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్యులు

సాలూరు: పట్టణంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉపకరణాల ఎంపిక శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరానికి సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన 40 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులు హాజరయ్యారు. చిన్నారులకు అవసరమయ్యే ఉపకరణాల కోసం వైద్యులు కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సృశిత విద్యా కో ఆర్డినేటర్ భానుమూర్తి, డాక్టర్లు మహేశ్వరరావు, కోటేశ్వరరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి పథకాల పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు కాంట్రాక్టర్లను కోరారు. మండలంలోని లచ్చయపేటలో 10 వేల లీటర్ల నీటి సామర్థ్యం, రూ.12 లక్షల నిధులతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వేసవి నాటికి అన్ని గ్రామాల ప్రజలకు ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు పంపిణీ చేసేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం చినభోగిలి, కాశీపేట, పెదభోగిలి గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ బగ్గందొరవలస గ్రామంలో ఇంటింటి కుళాయి పనులు పూర్తి కావచ్చాయని, ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇంటింటి కుళాయిలను ప్రారంభించనున్నారని తెలియజేశారు. తామరఖండి జగనన్న కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

బాలల రక్షణ కమిటీ ఏర్పాటు



బాలల రక్షణ కమిటీ సమావేశం

సీతంపేట: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీఓ కోసూరు గీతాంజలి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాలల రక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. బాలల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కమిటీలో చైర్మన్‌గా ఎంపీపీ, మెంబర్ కన్వీనర్‌గా సీడీపీఓ, సభ్యులుగా జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్ఐ, ఎంఈఓ, ఏపీఎం, ఏపీఓ, ఎంఎంఎస్ అధ్యక్షులు, స్కూల్ హెచ్ఎం, ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. ప్రతీ నెల మొదటి సోమవారం కమిటీ సమావేశం కావాలని నిర్ణయించారు.

కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణకు కృషిచేయాలి

- డీఎంహెచ్ఓ జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: కిశోరీ బాలికలలో రక్తహీనత నివారణకు కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఆస్పత్రి సమావేశ మందిరంలో ఆశ నోడల్ అధికారులతో పలు కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల వారీగా హెల్త్ ప్రోగ్రాంల ప్రగతి నివేదికలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించడం, ఆరోగ్య తనిఖీల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలని చెప్పారు. ప్రసవ సమయానికి వారం రోజులు ముందుగానే సంబంధిత రిఫరల్ కేంద్రంలో గర్భిణి అడ్మిట్ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. అందుకు అవసరమైన రవాణా ఏర్పాటు చేయడం, డెలివరీ అయ్యేంతవరకు పర్యవేక్షించడంపై శ్రద్ధ వహించాలని చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలి

అలాగే నవజాత శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ కోసం శిశువుల టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా కల్పించిన అన్ని వైద్యసేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాలని చెప్పారు. యుక్త వయస్సు వివాహాలపై ప్రభావితం అయ్యే శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, ఎపిడిమియాలజిస్టు డాక్టర్ నవీన్‌కుమార్, డీపీఓ లీలారాణి పాల్గొన్నారు.

రహదారులపై నూర్పులు

బలిజిపేట: బలిజిపేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు నూర్పు కళ్లాలుగా మారిపోతున్నాయి. అధికారులు స్పందించక పోవడంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారుతోంది. బలిజిపేట నుంచి పెదపెంకి, పదమాయవలస, వంతరాం, బొబ్బిలి వెళ్లే రోడ్లపై రైతులు రోడ్డు కనబడకుండా అపరాల పంట చేను పరిచేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరాలను గాలికిపట్టేటప్పుడు వచ్చే ధూళి ఎదురుగా వస్తున్న వారిపై పడుతుండడంతో కళ్లకు ప్రమాదకరంగా మారుతోందని వాపోతున్నారు. అటువంటి సమయంలో వాహనాలపై నుంచి బోల్తా పడుతున్నమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని పోలీస్‌శాఖ అధికారులు నియంత్రించి ప్రమాదాలు సంభవించకుండా చూడాలని కోరుతున్నారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ అనూష

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.సూర్యనారాయణ అధ్యక్షతన 21వ శతాబ్దపు నైపుణ్యాలు- వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్రశిక్ష సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. పార్వతీపురం మన్యం జిల్లా మేనేజర్ ఎ.అనూష శిక్షణను పర్యవేక్షించారు. సెసన్-16 నాయకత్వ ఉన్నత్వం, ప్రాజెక్ట్-3 విభాగాల్లోని అంశాలను వివరించారు. విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా మేనేజర్ అనుష అన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పాలకొండ: జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులకు ఇచ్చే నిధులు పెంచాలని కోరారు. ప్రస్తుతం అందిస్తున్న రూ.2.80 లక్షలతో ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు ఆర్థిక భారంగా మారిందని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రస్తుతం చెల్లించే మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. అలాగే కాలనీల్లో సీసీరోడ్లు, తాగునీరు, కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ద్వారపూడి అప్పారావు, కొప్పర త్రినాథ, మోహన్ తదతరులు పాల్గొన్నారు.

నీటి కొరత రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఏఈఈ అమరాన సందీప్

భామిని: వేసవి ప్రారంభానికి ముందే తాగునీటి పథకాల పనులు పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ అమరాన సందీప్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటి పథకాల పనులపై సర్పంచ్‌లతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బాలేరు, గురండి సర్పంచ్‌లు జామి ప్రభాకర్, జామి భైరాగి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిబోయిన చలపతి, పిరపక శ్రీను, కొండగొర్రి చంటి, వలరౌతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓకు సమస్యలు వివరిస్తున్న సింహాచలం

భామిని: విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంఈఓ ఎ.శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విద్యాశాఖపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో పలువురు ఉపాధ్యాయులు పదోన్నతులపై బదిలీ అయిన కారణంగా ఏర్పడిన ఖాళీలను ఇతర పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమించి తాత్కాలికంగా సమస్య పరిష్కరించాలని కోరారు. నాడు-నేడు మూడో విడతలో బురుజోల పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ తెలిపారు. మండలం నుంచి ఐదుగురు టీచర్లు బదిలీలపై ఇతర మండలాలకు వెళ్లారని, వారి స్థానాలను సర్దుబాటు చేయాలని ఉన్నతాధికారులను కోరామన్నారు. సమావేశంలో పాలకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ హిమరక మోహనరావు, బురుజోల సర్పంచ్ మడపాన కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ గ్రామంలోని రాయగడ చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.రమేష్ సోమవారం పరిశీలించారు. మస్టర్ల తనిఖీ చేశారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు పనులు చేసినట్లయితే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశం వద్ద ఉంటూ పనులను పర్యవేక్షించాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు. అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాసరావు, జేఈ తేజ ఉన్నారు.